ప్రమాదభరితంగా కేబుల్ వైర్లు



పోస్టాఫీస్ వద్ద కేబుల్ వైర్లతో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



సంతోష్‌నగర్ వేంకటేశ్వరస్వామి కమాన్ వద్ద స్తంభానికి ప్రమాదకరంగా ఉన్న ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు



ఓల్డ్ సంతోష్‌నగర్ కాలనీలో స్తంభానికి పాకిన చెట్లకొమ్మలు, తీగలు

- విద్యుత్ స్తంభాలపై గజిబిజిగా కేబుళ్లు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
- భయాందోళనలో ప్రజలు

సంతోష్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం 4 వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉంటే.. ఆ స్తంభాలపై 20 నుంచి 30 వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి ప్రమాదంగా మారుతుండటంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ తీగలు తగిలినప్పుడు మెరుపులు వచ్చి అవి కేబుళ్ల మీద పడి..మంటలు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు.

స్తంభాలకు కుప్పలుగా కేబుల్స్..

సంతోష్‌నగర్, ఐఎస్ సదన్‌లో విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన అడిగే నాథుడే లేడు. విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్లు ఏర్పాటు చేసేందుకు.. ఆ శాఖ నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ సైతం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కేబుళ్లు విపరీతంగా ఏర్పాటు చేస్తున్నారు. కేబుల్ వైర్లు తెగి రోడ్ల మీద పడినప్పటికి వాటిని సకాలంలో తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులు అవి తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలు తెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు అడ్డంకిగా మారుతున్నాయని విద్యుత్ సిబ్బంది పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసినన కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌కు పోస్ట్ బాక్స్ అందజేత



కలెక్టర్‌కు పోస్ట్‌బాక్స్‌ను అందజేస్తున్న భరత్

చంపాపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు మంగళవారం కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని ఎల్‌పీడీవో చైర్మన్ భరత్ పోస్ట్‌బాక్స్‌ను అందజేశారు. ప్రతి ఇంటికి పోస్టుబాక్స్ అనే నినాదం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ కొనియాడారు. సే నో టూ డ్రగ్స్ స్టిక్కర్‌తో ఉన్న పోస్టుబాక్స్‌ను ఇంటి గేటుకు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన ప్రజలకు సూచించారు.



శారదానగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

నాణ్యతగా అభివృద్ధి పనులు: నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో నూతనంగా రూ.50లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు లెవల్స్‌ను సరిచూసుకుంటూ సీసీ రోడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని ప్రజలకు ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ హెమునాయక్, కాలనీవాసులు నర్సింహారావు, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, డీసీ వంశీకృష్ణ

పరిసరాల శుభ్రత పాటించాలి: కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రజలకు సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్‌లో డీసీ వంశీకృష్ణతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి మంగళవారం మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్‌బాబు, శానిటేషన్ డీఈ నీలిమ, కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్తయ్య

24 మంది రైతులకు పంట రుణాలు పంపిణీ

హయత్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో 24 మంది రైతులకు రూ.2.65కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా 23 మందికి సభ్యత్వాన్ని అందజేశారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరం ఆడిట్‌ను ఆమోదించారు. అనంతరం సత్తయ్య మాట్లాడుతూ, సంఘం అభివృద్ధి కోసం సభ్యులతో కలిసి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు సంజీవరెడ్డి, లక్ష్మమ్మ, లక్ష్మారెడ్డి, యాదగిరి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, స్వప్న, సెక్రటరీ రాందాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మౌర్యానాయక్

వనస్థలిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథెట్లిక్ పోటీలకు వనస్థలిపురం డివిజన్ రేడియోకాలనీలోని తపస్వీ పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి మౌర్యానాయక్ ఎంపికైనట్టు పాఠశాల చైర్మన్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా అథెట్లిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథెట్లిక్ మీట్-20లో జిల్లా స్థాయి పోటీల్లో రన్నింగ్ విభాగంలో మౌర్యనాయక్ బంగారు పతకం, జావలిన్ త్రో విభాగంలో 5వ తరగతికి చెందిన నిహారిక, కార్తీకేయలు రెండు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం చైర్మన్ ప్రదీప్‌కుమార్ సన్మానించారు. ఈ నెల 7న జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తమ విద్యార్థి మౌర్యానాయక్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లింగం యాదవ్, ప్రిన్సిపాల్ రత్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్

మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

హయత్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల 5వ మహాసభల నిర్వాహణకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ తెలిపారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్, నర్సింహా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. సెప్టెంబర్ 19, 20 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో మున్సిపల్ కార్మికుల 5వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడదామని భాస్కర్ పిలుపునిచ్చారు. వచ్చే నెలలో జరిగే మున్సిపల్ కార్మికుల మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా తిప్పర్తి యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా కిషన్, కోశాధికారిగా ఎల్లయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, కవిత, స్వప్న, బలరాం, యాదగిరి, ఎల్లేష్, పెంటయ్య, బాబు పాల్గొన్నారు.

‘అందెల’ ఇంట్లో హరియాణా మాజీ గవర్నర్

సరూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ నివాసానికి విచ్చేశారు. అందెల ఆయనను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాసేరు వారివురు స్థానిక ఎన్నికలు, ఇతర రాజకీయాంశాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంతో దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి, శ్రీరాములు సతీమణి అండాలు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్‌రెడ్డి, జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రేయను సన్మానిస్తున్న శ్రీరాములుయాదవ్ దంపతులు

బీజేపీ సీనియర్ నాయకుడి ఇంటికి..

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ సీనియర్ నాయకుడు కళ్లెం బాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం సూర్యవంశీ గార్డెన్ సిటీలోని ఆయన నివాసానికి మంగళవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వచ్చారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు దత్తాత్రేయకు పుష్పగుచ్ఛాలతో పాటు శాలువాతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దత్తాత్రేయ తన ఆత్మకథ పుస్తకాన్ని పలువురికి అందజేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, పాపయ్యగౌడ్, పిల్లి శ్రీనివాస్‌యాదవ్, షకిల్‌మిర్జా,బండారి భాస్కర్, శ్రీనివాస్, మహేష్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చక్రాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌రావు కుటుంబానికి పరామర్శ..

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో ఆర్‌ఎంపీ డాక్టర్ తన్నీరు మధుసూదన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మధుసూదన్‌రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బండారు భాస్కర్ ఉన్నారు.

నాలాలో రసాయనాలు కలవకుండా చర్యలు

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలాలో వ్యర్థ రసాయనాలు కలవనీయకుండా సరైన విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. మన్సూరాబాద్ డివిజన్ సెవెన్ కాలనీ జేఏసీ నాయకులు పలు సమస్యలపై మంగళవారం ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాలాలో మూడు నెలలుగా వ్యర్థ రసాయనాలు కలుషితమై వస్తున్నాయని, దీంతో చర్మ, శ్వాస సంబంధ సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యతో పాటు వరదనీటి నాలాలో రసాయనాలు కలవడాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సెవెన్ కాలనీ జేఏసీ సభ్యులు రాంబాబు, కమలాకర్‌రావు, ప్రవీణ్, అజయ్, జనార్దన్, కిశోర్, కృష్ణయ్య, శ్రీనివాస్, రమేశ్, జయరాంరెడ్డి, సైదులు, లింగప్ప ఉన్నారు.



సమస్యల వినతిపత్రాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి అందజేస్తున్న సెవెన్ కాలనీస్ జేఏసీ సభ్యులు

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి: డీఈఓ

సరూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు సూచించారు. బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలాపూర్ మండలం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల సంరక్షణకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బాలికా విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని, వారికి ధైర్యసాహసాలు అలవరచాలని సూచించారు. బాలికల్లో శరీర పెరుగుదలకు అనుగుణంగా తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, ఇతర అంశాలపై వారికి అవగాహన కల్పించాలని డీఈఓ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో సుజాత, ప్రజ్వల సంస్థ మేనేజర్ బలరామకృష్ణ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, కేజీబీవీ మోడల్ స్కూల్ రిసోర్స్ పర్సన్ మల్లీశ్వరి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలికల సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు

చేజారిన ఎంటెక్ చాన్స్.!

- నేటి నుంచి పీజీఈసెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన
- బీటెక్ సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న విద్యార్థుల ఆశలపై ప్రైవేట్ కాలేజీలు నీళ్లు చల్లుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం.. మరోవైపు విద్యార్థులకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు చేజారిపోతున్నాయి. పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీఈసెట్ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బుధవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుండగా, ప్రైవేట్ కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. దీంతో ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న తమ బిడ్డల ఆశలు అడియాశలే అవుతున్నాయని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తాజాగా కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు జేఎన్‌టీయూ అధికారులకు, సాంకేతిక విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కమిషనర్ ఆదేశాలను సైతం కళాశాలల యాజమాన్యాలు ఖాతరు చేయడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణం సర్టిఫికెట్లు ఇప్పించేలా ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండేళ్లుగా తీరని ఆకాంక్ష..

ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని కీర్తి నగర శివారులోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గతేడాది బీటెక్ పూర్తి చేసింది. షెడ్యూల్ కులాలకు చెందిన తనకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైనప్పటికీ, రెండేళ్లుగా కాలేజీ యాజమాన్యం తన ఒరిజినల్ సర్టిఫికెట్లను జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. రెండేళ్లుగా పీజీఈసెట్ రాసి మంచి ర్యాంక్ తెచ్చుకున్నా, కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా తమ బిడ్డ ఎంటెక్ అవకాశాలను కోల్పోతున్నదని తండ్రి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ ఏడాదైనా తన బిడ్డ ఎంటెక్ చదివేందుకు అవసరమైన సర్టిఫికెట్లను సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఇప్పించాలని సాంకేతిక విద్యా కమిషనర్‌కు వినతిపత్రం పంపారు. స్పందించిన ఉన్నతాధికారి బాధిత విద్యార్థి సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని సదరు కాలేజీ ప్రిన్సిపాల్‌కు సోమవారం నోటీసులు పంపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను కలవగా సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. సాంకేతిక విద్యా కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల విషయమై సీవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డిని ఫోన్ ద్వారా ‘ఆంధ్రజ్యోతి’ వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

ఎన్నిసార్లు రేషన్‌కార్డుల పంపిణీ?

- బీజేపీ నేత శంకర్‌రెడ్డి ధ్వజం

సరూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులను ఎన్నిసార్లు పంపిణీ చేస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలాపూర్ మండలంలో గత నెల 28న ఎమ్మెల్యే సబితారెడ్డి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయగా, తాజాగా మంగళవారం మరోసారి మల్లాపూర్‌లో మంత్రి శ్రీధర్ బాబు కార్డులు పంపిణీ చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన నిలదీశారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను తమ స్వార్థ రాజకీయం కోసం వాడుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ విధానాలనే కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తోందని శంకర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో ఇరు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

అన్నప్రసాద వితరణ

చంపాపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చంపాపేట ఆర్యవైశ్య మహాసభ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాగర్‌రోడ్‌లోని సంఘం కార్యాలయ ఆవరణలో 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్‌గుప్తా హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమావాస్య అన్నప్రసాద వితరణ కమిటీ కన్వీనర్ విజయ్‌నాథ్‌గుప్తా, చంపాపేట ఆర్యవైశ్య మహాసభ సంఘం అధ్యక్షుడు రవీందర్‌గుప్తా, కోశాధికారి రమణయ్య, కమిటీ సభ్యులు జగన్‌గుప్తా, నరేష్, గురుమూర్తి, వెంకయ్య పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

వనస్థలిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హృదయ సంబంధ సమస్యతో బాధపడుతున్న ఆరేళ్ల చిన్నారికి వనస్థలిపురంలోని లాలిత్యం ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి చిన్నారి ప్రాణాలు కాపాడారు. మంగళవారం ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగాల గ్రామానికి చెందిన కావేటి ప్రశాంత్ కూతురు భవ్యశ్రీ(6) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. వెంటనే ప్రశాంత్ నగరంలోని ఆస్పత్రులతో పాటు తమ ఆస్పత్రికి వచ్చాడు. చిన్నారిని పరీక్షించగా వైద్యులు భవ్యశ్రీకి పుట్టుకతోనే గుండెకు రంధ్రం పడిందని చెప్పారు. నామ మాత్రపు ఖర్చులతో చిన్నారి భవ్యశ్రీకి అత్యాధునిక వైద్య పరికరాలతో డివైస్ క్లోజర్ సర్జరీ చేసి గుండెకు పడిన రంధ్రాన్ని విజయవంతంగా మూసివేశారు. ప్రస్తుతం భవ్యశ్రీ ఆరోగ్యంగా ఉందని తెలిపారు. తమ కూతురిని కాపాడిన వైద్యులకు ప్రశాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సైరన్, బ్లాక్ ఫిలింలపై స్పెషల్‌డ్రైవ్

సంతోష్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ప్రోటోకాల్ సైరన్లను బిగించడంతో పాటు బ్లాక్ ఫిల్మ్‌లను వినియోగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సౌత్-ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ హెచ్చరించారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ సీఐ మహ్మద్ ఆసీఫ్‌తో కలిసి మంగళవారం సాయిబాబా టెంపుల్, డీఎంఆర్ఎల్ చౌరస్తాలో సైరన్, బ్లాక్ ఫిలింలపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. తనిఖీలలో 3 కార్లకు సైరన్లు, పలు కార్లకు బ్లాక్ ఫిలింలను తొలగించి చలాన్లు విధించారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ చంద్రకుమార్ సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జువెనైల్ హోం బాలుర కోసం గాలింపు

- పరారీలో ఉన్న ఐదుగురిలో ఒకరు పట్టివేత

సైదాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం(జువెనైల్ హోం) నుంచి గత నెల 22న పారిపోయిన ఐదుగురు బాలురిలో ఒకరు పట్టుబడ్డారు. తప్పించుకుని తిరుగుతున్న మిగతా నలుగురు బాలుర కోసం పోలీసులు, హోం అధికారులు ప్రత్యేక టీంలుగా ఏర్పడి గాలిస్తున్నారు. నలుగురు ప్రస్తుతం బెంగళూరుకు పారిపోయినట్లు అధికారులు గుర్తించారు. వీరు ఫోన్, సిమ్‌కార్డులు, ప్రదేశాలు మారుస్తున్నారని, దీంతో అధికారుల బృందం, పోలీసులు బెంగళూరు వెళ్లినట్టు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానంతో ఒకటి, రెండు రోజులలోనే బాలురు దొరికే ఆవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సోమనాథ్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

- టీటీఐ అధికారులు

కొత్తపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) అధికారులు, ఇన్‌స్పెక్టర్ రాచపూడి విద్యార్థులకు సూచించారు. మంగళవారం రాచకొండ పరిధిలోని ఉప్పల్‌లో జడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, వెంకట్‌రెడ్డి కాలనీలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, 4 ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు, అలాగే ఉప్పల్ క్రాస్ రోడ్, సర్వే ఆఫ్ఇండియా వద్ద ప్రయాణికులకూ ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సోమనాథ్‌లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు పరిచయం చేయడంతో పాటు తెలుగు, ఇంగ్లిష్ సూచనలతో రూపొందించిన కరపత్రాలను, ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



లోకేష్(ఫైల్)

వనస్థలిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కంకల్ గ్రామానికి చెందిన మంచన్‌పల్లి లోకేష్ (31) నగరంలో బోయిన్‌పల్లిలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జూలై 26న వనస్థలిపురం పరిధిలోని గురుద్వారా రోడ్డులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు లోకేష్‌ను బండ్లగూడ జాగీర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న లోకేష్ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.